

చలి నుంచి ఉపశమనం కోసం చలి మంటలు



ప్రజాశక్తి- సోమల: మండలంలో గత నాలుగు రోజులుగా ఎండ లేకుండా మబ్బులతో కూడిన ఆకాశం ఈదురు గాలులు అప్పుడప్పుడు చిరుజల్లులతో ఆహ్లాదకరంగా ఉంది. గురువారం ఉదయం నుండి ఆకాశం మేఘావృతమై సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆపై ఈదురు గాలులు మొదలు కావడంతో పల్లెల్లో ప్రజలు చలిమంటలు వేసుకొని చలిగాలుల నుండి ఉపశమనం పొందుతున్నారు.

వైసిపి రాక్షస పాలనపై

కుప్పం ప్రజలు యుద్ధం చేసి గెలిచారు

నారాయణపురం తండా ముఖాముఖిలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-శాంతిపురం, రామకుప్పం

గడిచిన ఐదేళ్లలో వైసిపి రాక్షసులను చూశారని, రాక్షసుల చేతిలో నలిగిపోయారని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా 3వ రోజు గురువారం రామకుప్పం మండలం ఆవుల కుప్పం, నారాయణపురం, ఆరిమానుపెంట, వీర్నమలలో భువనేశ్వరి పర్యటించారు. మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వైసిపి నాయకులు తమ జేబులు నింపుకునేందుకు 5ఏళ్ల కేటాయించారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు వైసిపి నేతలు ద్రోహం చేశారు. అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలపై ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలను వైసిపి పాలనలో ఊచకోత కోశారు. అక్రమ కేసులతో జైళ్లలో మగ్గబెట్టారు. చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేయాలా.. అని ఆలోచిస్తారని కానీ గత పాలకులు ఎలా దోచుకోవాలని ఆలోచించారు. అందుకే 2024 ఎన్నికల్లో వారిని చిత్తు చిత్తుగా ఓడించారు. వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు ప్రాథమిక హక్కులు కోల్పోయారు. రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలనను అంతం చేశారని అన్నారు. వైసిపి పాలన ముగిసేనాటికి రాష్ట్ర ఖజానాలో పైసా కూడా మిగల్చలేదని అప్పులు మిగిల్చి వెళ్లారని విమర్శించారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా చంద్రబాబు పెన్షన్లు పెంచి, ఇంటింటికీ అందేలా చర్యలు తీసుకున్నారు లక్షలాది మంది ముఖాల్లో చిరునవ్వు చూశారని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ఇంకా ఏమేమి చేయాలో చంద్రబాబు కష్టపడుతున్నారు. వైసిపి పాలనకు సంబంధించిన ఏ ఫైల్ ముట్టుకున్నా అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడాలంటే మరో 5నెలలు పట్టేలా కనిపిస్తోందని,రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారని తెలిపారు. అలాగే కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని, ప్రత్యేక మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేస్తారని పేర్కొన్నారు. చంద్రబాబును 8సార్లుగా ఎమ్మెల్యేగా ఎన్నుకున్న కుప్పం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తమ కుటుంబంపై మీరు పెట్టుకున్న నమ్మకానికి, మీరు చూపిస్తున్న ప్రేమకు మేము ఎప్పుడూ రుణపడి ఉంటామని మీ రుణం తీర్చుకుంటామని అందుకే మీ ముందుకు వచ్చానని అన్నారు. పదవులు, అధికారం శాశ్వతం కాదు...మీ ప్రేమాభిమానాలే ముఖ్యం...మీ సంక్షేమం, అభివృద్ధే మాకు ముఖ్యం అన్నారు. నియోజకవర్గ మహిళల రుణం తీర్చుకునేందుకు మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, మీకు ఏ సమయంలో అయినా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డాక్టర్ సురేష్ బాబు, గాజుల భాస్కర్ బాషా, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, సుబ్రి,కృష్ణ నాయక్, కమరాజ్ నాయక్, మనోహర్ ,గణేష్, జయశంకర్, బాలరాజు, వెంకటరమణ,సతీష్,అవినాష్, మంజునాథ్, ఆదిల్ ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురంలో డ్వాక్రా మహిళలకు చెక్కులు అందిస్తున్న భువనేశ్వరి

ప్రజా ప్రభుత్వంతో మహిళలకు స్వాతంత్రం వచ్చింది

తెలుగుదేశం ప్రజాప్రభుత్వంతో మహిళలకు స్వాతంత్రం వచ్చిందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను నిజం గెలవాలి కార్యక్రమం నిర్వహించినప్పుడు మీరు నాపై చూపిన ప్రేమ, గౌరవం నన్ను ఈరోజు ఇక్కడికి తీసుకొచ్చిందని అన్నారు. చంద్రబాబుపై మీరు గత 40సంవత్సరాలుగా పెట్టుకున్న నమ్మకానికి వారి కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబును 53 రోజులు రాజమండ్రి జైల్లో నిర్బంధించినప్పుడు మహిళలు రోడ్లపైకి వచ్చి పోరాడారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దించి, ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని అన్నారు. తాను ముఖ్యమంత్రి భార్యగా ఇక్కడికి రాలేదని మీలో ఒక మహిళగా ఇక్కడికి వచ్చానని అన్నారు. గత పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్ర మహిళలకు ప్రజాప్రభుత్వంతో స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. చంద్రబాబు రానున్న కాలంలో మన రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళతారని, ప్రజలంతా సంతోషంగా ఉంటారని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గానికి కృషి విజ్ఞాన కేంద్రాన్ని తెచ్చారని, దీని ద్వారా రైతులకు మేలు చేసేందుకు చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని, త్వరలో దీన్ని రైతులకు అందుబాటులోకి తెస్తారని తెలిపారు. అనంతరం శ్రీనిధి కింద మఠం గ్రామపంచాయతీలోని 137 మంది మహిళలకు స్వయం ఉపాధి ,కోసం రూ.1.10కోట్లు చెక్కును భువనేశ్వరి డ్వాక్రా మహిళలకు అందించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా ఏజీఎం ప్రకాష్, కుప్పం నియోజకవర్గ మేనేజర్ శ్రీకృష్ణ శరత్, డిఆర్డిఏ పీడీ తులసి, డాక్టర్ సురేష్ బాబు, విశ్వనాథ నాయుడు, ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, నాగభూషణం రెడ్డి, జయరాం రెడ్డి పాల్గొన్నారు.

సాయిమాత సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య సాయిబాబా ఫోటో బహూకరించడం జరిగినది. అనంతరం సాయి మాతా సేవ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ట్రస్ట్ అధినేత జగదీష్ బాబు వివరించారు. వేద పండితులు రామ్మూర్తి దీక్షితులు సోమశేఖర్, సోమశేఖర్ దీక్షితులు, బాలాజీ, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

మహాసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు



ప్రజాశక్తి- పుంగనూరు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల ప్రమాదకరమైన రవాణా బిల్లును తీసుకురావడం దారుణమని వెంటనే రద్దు చేయాలని పుంగనూరులో జరిగిన ఆటో డ్రైవర్ల మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక ఇందిరా సర్కిల్లో భారత్ ఆటో యూనియన్ మహా సభను గురువారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రవాణా రంగకార్మికుల నడ్డి విరుస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం కలిగిస్తున్న రవాణా రంగాన్ని నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమాజానికి సేవ చేస్తున్న ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారిపై పెనాల్టీలు రద్దు చేయాలని, పుంగనూరులో ఆటో కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాలలో ఆటో కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆటోనగర్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం తెస్తామని అమలు చేస్తే ఆటో కార్మికులకు నష్టం లేకుండా చేయాలని కోరారు. జిల్లాలో అన్ని చోట్ల ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేయాలని, పోలీసుల వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా చట్టాన్ని రద్దు చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రవాణా చట్టం వలన ఆటో కార్మికులకు జీవనోపాధి ఇబ్బందికరంగా మారిందని ప్రమాదకరమైన రవాణా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా మౌల, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, సహాయ కారదర్శులుగా అహ్మద్ బాషా, ప్రసాద్ బాబు కోశాధికారిగా ఇమ్రాన్లతోపాటు 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

నేడు ఉచిత కృత్రిమ అవయవాల ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగరంలోని తపోవనంలో 26వ తేదీ శుక్రవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాల ప్రత్యేక శిబిరాన్ని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరయు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఏపీ నిరుద్యోగ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపుకు వచ్చే దివ్యాంగులు తమ వెంట ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్‌లతో పాటు వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కూడిన 2 సెట్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు. ఈ క్యాంపులో కొలతలు తీసుకున్న 20 రోజుల తర్వాత సుమారు రూ.51,000 విలువ గల ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడునని ఆయన తెలిపారు. పేద దివ్యాంగులకు, పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తూ, కృత్రిమ కాలు కొనగలిగే స్తోమత లేని వారికి ఇది ఒక మంచి సదావకాశమని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు 94403 57522, 62814 86722 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంఅండ్ హెచ్ఓ



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ప్రభావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సమీపంలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొదటగా పిహెచ్‌సిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో జరుగుతున్న కాన్పులు తదితరాలపై వైద్యాధికారి డాక్టర్ సురేఖను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థలో ఉండడంతో ఎక్కువ కాన్పులు జరగడం లేదని నూతన భవనాన్ని ప్రారంభిస్తే మరిన్ని కాన్పులు చేసే అవకాశం ఉందని వైద్యాధికారి వివరించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ ల్యాబ్‌లను ఆమె పరిశీలించారు. ఆ తర్వాత సమీపంలోని యాదమరి ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో పకిటిక్‌లో జరుగుతున్న లెప్రసీ సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి స్థాయిలో పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయి వ్యాక్సిన్ ఎలా జరుగుతున్నదని, ప్రజల నుండి ఎలాంటి స్పందన వస్తున్నదన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

రికార్డు రూమ్‌ను పరిశీలించిన డిఆర్‌ఓ



రికార్డు రూములను పరిశీలిస్తున్న డీఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక గిరింపేటలోని పాత కలెక్టరేట్‌లోని పాత రికార్డుల రూమ్‌ను డిఆర్ఓ బి.పుల్లయ్య పరిశీలించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన పాత రికార్డులు భద్రపరిచిన రికార్డ్ రూమ్ చుట్టూ తిరిగి పరిశీలించి భద్రతా పరంగా సీసీ కెమెరాలు, పోలీసులతో సెక్యూరిటీ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఆర్‌కేకు ఆదేశించారు. దీంతో పాటు పాత కలెక్టరేట్‌లో గల చూడా కార్యాలయాన్ని, దాని పక్కనే ఉన్న పాత ట్రెజరీ కార్యాలయంకు సంబంధించిన రూమ్‌ను పరిశీలించారు.

ఇద్దరికి పిహెచ్ మేస్త్రీలుగా ఉద్యోగ్యోన్నతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో ఇద్దరికీ పిహెచ్ మేస్త్రీలుగా ఉద్యోగోన్నతి పత్రాలను నగర మేయర్ ఎస్.అముద గురువారం అందించారు. ప్రజారోగ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లలో సీనియారిటీ జాబితా ప్రకారం నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ కౌన్సిలింగ్ నిర్వహించారు. సీనియారిటీ, ధృవపత్రాల పరిశీలన అనంతరం పీహెచ్ వర్కర్లుగా ఉన్న ఎస్.బాబు, కె.చిన్నబాబులను అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు పీహెచ్ మేస్త్రీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను మేయర్ చేతుల మీదుగా వారికి అందించారు. కార్యక్రమంలో మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.



రూ.15 కోట్లు టోకరా

- యాప్ ద్వారా మోసపోయిన బాధితులు
- మెప్మాలో కీలక ఉద్యోగి నిర్వాకం
- డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు



మోసపోయిన బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి- పలమనేరు: డాయ్ యాప్ ద్వారా దాదాపు రూ.15కోట్ల దాకా టోకరా వేశాడు ఓ మాయగాడు.. ఒకటికి పదింతలు ఆదాయం వస్తుందంటూ నమ్మించి మోసం చేశాడు.. అత్యధికం లాభాలు వస్తాయడంతో ప్రజలు ఎగబడి యాప్‌లో డబ్బులు కట్టారు.. తీరా రూ.15 కోట్లు పెట్టుబడులు రాగానే టోకరా వేశారు. విషయం తెలుసుకున్న బాధితులు అధిక సంఖ్యలో పలమనేరు డిఎస్పీని ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు..

పలమనేరు పట్టణంలో డాయ్ యాప్ ద్వారా రూ.15 కోట్లు స్వాహా చేసిన సంఘటన గురువారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు డాయ్ యాప్‌లో ఎవరికి ఎంత స్థోమత ఉందో అంత ఇన్వెస్ట్మెంట్ పెడితే అందుకు రెట్టింపుగా ఆదాయం వస్తుందని యాప్ నిర్వాహకులు నమ్మబలికారని, మొదటలో ఇన్వెస్ట్మెంట్ పెట్టిన కొంతమంది డాయ్ ప్రోత్సాహక నగదు పంపిణీ చేసి నమ్మించారన్నారు. యాప్‌లో సామాన్య జనంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండటంతో నమ్మి ఇన్వెస్ట్మెంట్ పెట్టామని వాపోయారు. ఇందులో ప్రధానంగా డిఆర్‌డిఏకు సంబంధించిన ఆర్పీలు ముఖ్యపాత్ర పోషించారని యాప్ నిర్వాహకులు ఇవ్వకపోయినా మీరు పెట్టిన ఇన్వెస్ట్మెంట్ డబ్బులు మేమే తిరిగి ఇస్తామని చెప్పారన్నారు. డాయ్ యాప్‌లో సుమారు 5000 మంది ఇన్వెస్టర్లు ఉన్నారని వివరించారు. కొంతమంది అప్పుచేసి మరి కొంతమంది ఇంటిలో ఉన్న బంగారు నగలను తాకట్టు పెట్టి ఇన్వెస్ట్మెంట్ పెట్టామని కన్నీరుమున్నీరు అవుతున్నారు. రెండు నెలలు కావస్తున్న పెట్టిన పెట్టుబడికి తిరిగి డబ్బు రాకపోవడంతో, యాప్ నిర్వాహకులు, ఆర్పీల నుండి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులు ఆశ్రయించామని తెలిపారు. ఈ విషయం పైన అధికారులు స్పందించి మోసం చేసిన డాయ్ యాప్ నిర్వాకులపై చర్యలు తీసుకుని వారి నుండి కట్టిన నగదును తీసి ఇవ్వాలని కోరుతున్నారు.

పలమనేరు మునిసిపాలిటీ మెప్మాలో కీలక ఉద్యోగి రాజేష్ ఇందుకు ముఖ్య సూత్రధారి. ఇతను అధికారం అడ్డుపెట్టుకుని మెప్మాలో పనిచేసే ఆర్పీలను ఇతర మహిళా ఉద్యోగస్తులను ఇందులో ఏజెంట్లుగా చేర్చుకొని వారి ద్వారా ఎక్కువ డబ్బులు పోగు చేయడం జరిగిందని బాధితులు వాపోతున్నారు. ఈ యాప్‌లో పెట్టుబడి పెడితే దాదాపు 40 రోజులకి పది రెట్లు ఆదాయం వస్తుందని ఆశ పెట్టడంతో అధిక సంఖ్యలో బాధితులు డబ్బులు పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఏజెంట్లను నిలదీయడంతో వారు దిక్కుతోచని స్థితిలో డిఎస్పీని ఆశ్రయించారు. డిఎస్పి మాట్లాడుతూ అనేకమార్లు సైబర్ క్రైమ్ గురించి ఇటువంటి యాప్‌ల గురించి అనేక విధాలుగా పత్రికలలో మీడియాలో తెలియచేస్తున్న ఇంకా ప్రజలు ఈ విధంగా నమ్మి మోసపోతూనే ఉన్నారని అన్నారు.

అర్జీల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: డిఆర్ఓ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు చేపట్టాలని డిఆర్ఓ బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా సచివాలయంలోనీ సమావేశపు మందిరంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అందిన అర్జీల పరిష్కారంపై వివిధ శాఖల వారీగా తీసుకున్న చర్యలను డిఆర్ఓ, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించడం జరుగుతున్నదని ఎక్కువగా అర్జీలు అందిన రెవెన్యూ, పిఆర్, డిఆర్డిఏ, విద్యా, పోలీసు, సంబంధిత శాఖల అధికారులు బృందాలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అర్జీదారుల సమక్షంలో సమస్య పరిష్కారం కొరకు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని, అర్థవంతంగా అర్జీదారునికి ఎండార్స్మెంట్ ఇవ్వాలని, ఆర్థికపరమైన అంశాల విషయంలో ఉన్నతాధికారులకు పంపాలన్నారు. అర్జీలకు సంబందించి తీసుకున్న చర్యలను 12 కాలమ్స్‌తో కూడిన నివేదికను ప్రతి శాఖ వారు కలెక్టరేట్ కు అందిస్తూ ప్రతి అర్జీదారునికి ఇచ్చిన ఎండార్స్మెంట్ కాపీని కూడా జత చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్‌పి ఆరిఫుల్లా, జడ్పీ సీఈఓ గ్లోరియా పిఆర్, ఆర్ అండ్‌బి ఎస్ఈ లు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతీ దేవి, డిఎల్‌డిఓ రవి కుమార్ అధికారులు పాల్గొన్నారు.

జేజేఎం పథకానికి సహకారం అందించండి : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దేశంలోని ప్రజలందరికీ రక్షిత మంచినీటిని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల జీవన్ మిషన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు పరచడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు విమర్శించారు. జాతీయ స్థాయిలో చూస్తే 76 శాతానికి పైగా లబ్దిదారులు జేజేఎం పథకాన్ని దేశవ్యాప్తంగా సద్వినియోగం చేసుకుంటే ఏపీలో కేంద్రం ఇచ్చిన లక్ష్యాన్ని ఎందుకు చేరుకోలేకపోయిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎందుకు చొరవ చూపలేకపోయారన్న అంశాలు లోక్‌సభలో గురువారం బట్టబయలయ్యాయి. ఎంపి జల జీవన్ మిషన్ పథకానికి సంబంధించి, వివరాలను కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. జేజేయం పథకానికి సంబంధించి ప్రయోజనాలేంటో తెలియజేశాయి. చిత్తూరు పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే జలజీవన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్లో అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా జేజేఎం పథకాన్ని ఏపీలో కొనసాగించేందుకు కావలసిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు. కేంద్ర మంత్రి ఇచ్చిన వివరణకు ప్రసాదరావు సంతృప్తి వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రిని కలిసిన ఆవులపల్లి రైతులు





ప్రాజెక్టుకు ముందు సీతమ్మ చెరువు, తరువాత బీడుగా మారిన చెరువు



ముఖ్యమంత్రిని కలిసిన రైతులు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లి వద్ద సీతమ్మచెరువుపై అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టను రద్దు చేయాలని కోరుతూ ఆవులపల్లె గ్రామానికి చెందిన పలువురు రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గురువారం విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. జిఆర్‌టి నెం.461 రద్దు చేయాలని రైతుల డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఆవులపల్లి ప్రాజెక్ట్ పనులకు అభ్యంతరం తెలిపినందుకు తమపై అక్రమ కేసులు బనాయించారని, సీతమ్మ చెరువును పునరుద్ధించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సోంపల్లి లక్ష్మీపతి నాయుడు, గుత్తా గుణశేఖర్ నాయుడు, చంద్ర ఆచారి, యాదవ నాయుడు, తేజ, రమణమూర్తి ఉన్నారు.

మట్టి తరలించడానికి

అధికారుల అత్యుత్సాహం



మట్టిని తరలించడానికి సిద్ధంగా ఉన్న యంత్రాలు

ప్రజాశక్తి- విజయపురం: మండలంలో గ్రావెల్ మట్టిని తమిళనాడుకు తరలించడానికి అటు మైనింగ్ అధికారులు, ఇటు తహసీల్దార్ కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు పూర్తై ఫలితాలకు ముందుగానే మే 16న 60 రోజుల పాటు గ్రావెల్ తరలించుకోవడానికి మండలంలోని మహారాజపురం రెవెన్యూలో సర్వే నెంబరు 1 పార్ట్ అంటూ తాత్కాలిక అనుమతి తీసుకొని గ్రావెల్ తరలించడానికి ప్రయత్నాలు చేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మండలం నుండి సహజ వనరులను తరలించడానికి కుదరదని, ఎవరైనా తరలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ ఎలాగైనా గ్రావెల్ మట్టి తరలించి సొమ్ము చేసుకోవాలని తాత్కాలిక అనుమతి పెట్టుకొని పావులు కదుపుతున్నారని ఆరోపించారు. తహసీల్దారుకు ఎలాంటి సమాచారం లేకుండానే యంత్రాలను సిద్ధం చేయడంపై పలు అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. ఈ విషయమై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు ఇస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు భాను ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాజుపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై మొక్కజొన్నలు, జొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. జొన్నలు ప్రతి ఒక్కరూ ఆహారంగా తీసుకోవడం వల్ల అనారోగ్యపరమైన సమస్యలు రావన్నారు. పశుసంవర్ధక సహాయకుడు మహేష్, మంజునాథ్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, గణేష్, క్రిష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'కుష్టు' నిర్మూలనకు సహకరించండి

హెచ్ఈవో ఉదయ్ భాస్కర్



ప్రజాశక్తి -సదుం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి స్థానిక ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని చెరుకువారిపల్లి ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి, నోడల్ అధికారి ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది 38 టీములుగా ఏర్పడి ఈనెల 18 నుంచి మండల పరిధిలో ఉన్న 4,146 ఇండ్లను పరిశీలించారని, ఇందులో 1,445 మందిపై కుష్టువ్యాధి పరీక్షలు నిర్వహించగా 63 మంది అనుమానిత రోగగ్రస్తులుగా గుర్తించామన్నారు. ఇందులో ముగ్గురు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలల నుండి 12 నెలలు వరకు పూర్తిగా నయం చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ దేవదాస్, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్స్ మనీషా, శ్రావణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'జగన్ తప్పుడు ప్రచారాలను ప్రజల నమ్మరు'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధర్నాను తెలుగు ప్రజలు చీదరించుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు సురేంద్ర కుమార్, మోహన్ రాజ్, కోదండ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో చేసిన రాజకీయ హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలు, అరాచకాలు గురించి ప్రజలకు బాగా తెలుసని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలనే తప్పుడు ప్రచారాలతో హత్యలు, అరాచకాలు చేసిన వారితో కలిసి ధర్నా చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో అవినీతి, దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వేలంలో రూ.లక్ష 25 వేలు ఆదాయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్కంధ పుష్కరిణీ సమీపంలో కుమారగిరిపై వెలసి ఉన్న వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో 28వ తేదీ నుంచి నిర్వహించే వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన తలనీలాల వేలం పాటలో ఆలయానికి రూ. లక్ష 25 వేలు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతి ఏటా భక్తులు స్వామివారికి సమర్పించే తలనీలాల వేలం పాటలో వచ్చే ఆదాయాన్ని అలయ అభివృద్ధికి వెచ్చించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఆడికృత్తిక వేడుకలను ఎండోమెంట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. నాయకులు వాసుదేవరెడ్డి, రవియాదవు ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ గ్రామంలోని 120ఇండ్లలో దోమల నివారణ కోసం మిలాదిన్ ద్రావణాన్ని స్ప్రే చేసినట్టు ఏఎన్ఎం మదనిక తెలిపారు. దోమల నివారణ మహోత్సవంలో భాగంగా సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రత దోమల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, మురుగునీటి కాలువలపై స్ప్రే చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై అవగాహన సదస్సు



ప్రజాశక్తి- గంగవరం: పారిశుధ్య పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా మండలంలోని కీలపట్ల పంచాయతీలో బుధవారం ఎంపిడిఓ మధుసూదన్, ఈఓఆర్‌డి శివప్రసాద్, సర్పంచ్ చంద్రశేఖర్ కలసి పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో శుభ్రత పాటించాలని, మహిళలు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా కేటాయించిన చోటే వేయాలన్నారు. వృధా నీరు వీధులలోకి రాకుండా చూసుకోవాలని శుభ్రత పాటించాలని, వారివారి నివాసాల ఆవరణలో గుంతలు నిర్మించుకొని వృధా నీరంతా వాటిలోకి వెళ్లేలా చూడాలన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మేనక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను లక్ష్మీదేవి గురువారం పర్యవేక్షించారు. దోమల నివారణ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు ఎక్కడైనా పైప్ లైన్ల లీకేజీ ఉంటే మరమ్మతులు చేయిస్తున్నామని ఆమె తెలిపారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి పైప్లైన్ డ్యామేజ్ వల్ల తాగునీరు వృధాగా పోతుండడంతో వాటిని మరమ్మతు చేసి నీరు వృధా కాకుండా చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'శిక్ష సప్తాహ్'లో భాగంగా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- సోమల: కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తూ వస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో మండల కేంద్రమైన సోమల ప్రాథమిక పాఠశాలలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు పలు కళారూపాల ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు. హిందూ ముస్లిం క్రిస్టియన్ వేషధారణ వేసిన విద్యార్థులు కులం మతం అనేది ఏదీ లేదని భారతదేశం అంతా ఒకటేనని అందరూ ఐకమత్యంగా మెలగాలని చేసిన మూకీ ప్రదర్శన ఆకట్టుకుంది.

పెద్దపంజాణి: మన భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయంగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్‌లో భాగంగా విద్యావారోత్సవాల సందర్భంగా గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నటువంటి సంస్కృతి సంప్రదాయాలు గురించి వివరించారు. విద్యార్థులు వివిధ జాతీయ నాయకుల వేషధారణలో సాంస్కృతిక దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, రాజేష్ బాబు, గంగాధర్, మాధవన్ పాల్గొన్నారు.



కార్వేటినగరం: విద్యార్థుల్లోని విద్యాసామర్థ్యాలను పెంపొందించేందుకు ఆటపాటలు ఎంతో దోహదపడుతుందని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. గురువారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు పాఠశాల ఆవరణంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆటల పాటల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థులు చూపరులు ఆకట్టుకునేలా బాలకార్మికుల వ్యవస్థనిర్మూలన, స్త్రీ సాధికారత అంశాలపై ప్రదర్శించారు. నాటిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన రమ్య, లీన మోక్షలను హెచ్ఎం అభినందించారు. పిఈటి తిరుమలరాజు, ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, వెంకట రమణయ్య, డిల్లీబాబు చిన్నయ్యశెట్టి, రంజిత్ కుమార్ సరస్వతి, హరిత పాల్గొన్నారు.

వరి సాగుపై అవగాహన



ప్రజాశక్తి -సదుం: రైతులు వరి నాట్లు వేసే ముందు వరి పైరు కొనలను కట్‌చేసి వరి నాట్లు వేసుకోవాలని అమ్మగారిపల్లి విహెచ్ఏ స్వర్ణలత తెలిపారు. గురువారం ఆమె అమ్మగారిపల్లి గ్రామ సచివాలయంకు దగ్గర్లో రైతు కూలీలు వరి నాట్లు వేస్తుంటే అక్కడకు వెళ్లి వరినారును పరిశీలించి, కొనలను కత్తరించి నాటుకోవాలని రైతులకు వరిసాగుపై అవగాహన కల్పించారు. రైతులు ఇలా చేసినట్లయితే వరి నారు కొనలలో ఉన్న చీడ పురుగుల గుడ్లు, చీడ పురుగులు పోతాయని, దీంతో వరి మళ్ళు ఆరోగ్యాంగా పెరుగుతాయన్నారు. అనంతరం నారుమళ్ళు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు.

మౌలిక వసతుల కల్పనకు సర్వే

ప్రజాశక్తి- గుడిపల్లి: మండల కేంద్రంలో మౌలిక వసతులలో భాగంగా గ్రామాల్లో ఎక్కడెక్కడ సిమెంట్ రోడ్ల అవసరాలు ఉన్నాయో పరిశీలించి ప్రతిపాదనలు పంపడానికి పంచాయతీ అధికారులతో కలిసి టిడిపి నాయకులు సర్వే నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, నియోజకవర్గం దళిత అధ్యక్షులు సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి భాను, వెంకటేష్, కోడెప్ప, మాజీ ఎంపిటిసి వెంకటేష్ జనసేన నాయకులు గణేష్ పాల్గొన్నారు.

టిటిడి అడిషనల్ ఈఓగా వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి -తిరుమల: టీటీడీ అదనపు ఈవోగా ఐఆర్ఎస్ అధికారి చిరుమామిళ్ల వెంకయ్య చౌదరిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అన్ని శాఖల్లో ప్రక్షాళనకు నడుం బిగించింది. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని భావించిన ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీటీడీ అదనపు ఈవోగా ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరిని ప్రభుత్వం నియమించింది. టీటీడీ కి నియమితులైన వెంకయ్య చౌదరి ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కస్టమ్స్ కమిషనరేట్, విజయవాడ విభాగంలో కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో ఏపీ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీగా పనిచేశారు. 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన వెంకయ్యచౌదరి ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఆయనను డిప్యుటేషన్‌పై ఏపీకి పంపింది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

ప్రజాశక్తి -తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 8 గంటలు పడుతుండగా, రూ. 300 ప్రత్యేక దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. ఇక వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు బుధవారం స్వామి వారిని 73,023 మంది భక్తులు దర్శించుకున్నారు. 26,942 మంది భక్తులు తమ తలనీలాలు సమర్పించి వెంకన్నకు మొక్కు తీర్చుకున్నారు. రూ.3.98 కోట్లు శ్రీవారి హుండీ ఆదాయం అని టీటీడీ అధికారులు చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు పెంచాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: అంగన్వాడీ కేంద్రం ఆవరణాల్లో పోషకాలు అందించే పెరటి తోటల పెంపకాన్ని విధిగా చేపట్టాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పెద్ద దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార తోటల పెంపకంపై అంగన్వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ శాస్త్రవేత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ఆవరణంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందించే తోటలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించడమే కాకుండా మంచి పోషక విలువలు కలిగిన కూరగాయలను అందుబాటులోకి తీసుకురావడమే రాస్– కృషి విజ్ఞాన కేంద్రం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తమ గ్రామాల్లో కూడా పోషకాలతో కూడిన కూరగాయాలు పండించే విధంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ ఏబీ శ్రీలత మాట్లాడుతూ పోషకాహార తోటలు పెంచుకొనే విధానం, వివిధ కూరగాయలైన ఆకు కూరలను సేంద్రియ పద్ధతిలో పెంచే విధానంపై క్షుణ్ణంగా వివరించారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

'అభ్యుదయానికి' చిరునామా 'అడిగోపుల'



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : అభ్యుదయానికి చిరునామా అడిగోపుల సాహిత్యం అని వక్తలు ఉద్ఘాటించారు. అక్షరాలను ఆస్తులుగా తెలుగు సాహిత్యానికి అందించారన్నారు. అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ గురువారం వేమని విజ్ఞాన కేంద్రంలో పలు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో జరిగింది. అడిగోపుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభకు మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత రాసాని మాట్లాడుతూ కవిత్వానికి నిలువెత్తు సంతకం అని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించదగిన రచయిత అడిగోపుల అని అన్నారు. సీనియర్ పాత్రికేయులు కొత్వాలు అమరేంద్ర మాట్లాడుతూ అక్షరాలకు ఆయుష్షు పోసిన కృషీవలుడన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ రాబోవు తరానికి ప్రేరణని అన్నారు. తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ అడిగోపుల కవిత్వం రేపటి సమాజాన్ని ఆవిష్కరించిందన్నారు. గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యానికి చెరిగిపోని సంతకం అన్నారు. అడిగోపుల కుమారుడు శ్రీకాంత్ మాట్లాడుతూ తన తండ్రి జీవితాన్ని, సాహితీ జ్ఞాపకాలను విపులంగా పంచుకున్నారు. సాహితీవేత్తలు భూమన్, సాకం నాగరాజు, యువశ్రీ మురళి, ఒ.వెంకటరమణ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఎస్వీయూ ఆచార్యులు సత్యనారాయణ, టెంకాయల దామోదరం, నెమిలేటి కిట్టన్న, పొక్కళ్ల సుభద్ర, నడ్డినారాయణ పాల్గొన్నారు.

స్మగ్లింగ్ నిరోధానికి కఠిన చర్యలు: ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. గురువారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులతో సమావేశమై టాస్క్ ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్మగ్లర్లను నిరోధించడానికి మరిన్ని వ్యూహాలను చేపట్టాల్సి ఉందని సూచించారు. ముఖ్యంగా అడవుల్లోకి వెళ్ళినపుడు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థ వినియోగంపై సూచనలు ఇచ్చారు. కడప, రైల్వే కోడూరు, సానిపాయ సబ్ కంట్రోల్స్ నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ వివరించారు. తరువాత టాస్క్ ఫోర్సు ఆవరణలోని కంట్రోల్ రూమ్, పోలీసు స్టేషన్, అక్కౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ఏహెచ్‌లో ముగ్గురు పారిశుధ్య కార్మికులపై వేటు!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే చిరుద్యోగులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ రాజకీయ వేధింపులు మొదలైపోయాయి. ముఖ్యంగా స్కీం వర్కర్లు, పారిశుధ్య కార్మికులను గత ఎన్నికల్లో వేరొక రాజకీయ పార్టీలకు పనిచేశారనే అక్కసుతో వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసేశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికారం మారగానే రాజకీయ వేధింపులు ఎదుర్కొంటున్న చిరుద్యోగులు ఎక్కువైపోతుండటం గమనార్హం. తాజాగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలోని పారిశుధ్యం విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న లోకనాథం, ప్రభాకర్, భువనేశ్వరి అనే ముగ్గురు కార్మికులను రాజకీయ వేధింపులతో నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా తన దష్టికి రాలేదని వివరణ ఇచ్చారు. రాజకీయ వేధింపులు తగవని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ఖండించారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం ధ్వంసం



అక్రమ మద్యం నాటు సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని యాదమరి, తవనంపల్లె, గుడిపాల పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 116 కేసులలో పట్టుబడిన, సీజ్ చేసిన సుమారు రూ.27లక్షల విలువ గల 3,240 లీటర్ల అక్రమ మద్యం, 1,258 లీటర్ల నాటు సారను యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల పెరుమాళపల్లి గ్రామంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో రోడ్‌రోలర్‌తో గురువారం ఉదయం అధికారుల సమక్షంలో నాశనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీతో పాటుగా చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ రెడ్డి, ఎస్ఈబీ ఏఈఎస్ రవి, యాదమరి ఎస్ఐ రామాంజనేయులు, తవణంపల్లి ఎస్ఐ అనిల్ కుమార్, గుడిపాల ఎస్ఐ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం వెంగేపల్లి రైల్వే ట్రాక్ సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మరణించిన సంఘటన చోటు చేసుకుంది.. రైల్వే పోలీసుల సమాచారం మేరకు సుమారు గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందన్నారు. మృతుడు కాఫీ కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడని సుమారు 35 సంవత్సరాలు వయసుగల యువకుడు అయి ఉండవచ్చునని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే ఇతని వివరాలు తెలియజేయాలని రైల్వే పోలీస్ అధికారి నాగరాజు, గణేష్ కోరారు.

'విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బేటి బచావో బేటి పడావో కార్యక్రమం గురువారం కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ దామోదర నాయుడు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి బలోపేతమైన చదువులతోపాటు సామాజిక చైతన్యాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించే రక్షణ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారిని నాగమణి మాట్లాడుతూ పాఠశాల బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా ఉపాధ్యాయుల వద్ద తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలకు పోలీస్ శాఖ అమలు చేస్తున్న అంశాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్ పాఠశాల ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుని భూమి ఆక్రమణ

న్యాయం చేయాలని నిరసన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చల్లారికుంట పంచాయతీ చిన్నచల్లాగుంట గ్రామానికి చెందిన మునస్వామి మాదిగ 1.80 సెంట్లు భూమిలో సాగు చేస్తుకుంటున్నాడు. అయితే ఆరు నెలల క్రితం మునస్వామి భూమి 80 పెట్లు అదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. భూసమస్యపై గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పిఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ సూరపాకం యువరాజు మాదిగ మాట్లాడుతూ దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, భూ ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మునస్వామికి న్యాయం చేయాలని లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

డెంగీ నివారణకు చర్యలు: ఎంపీడీవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : డెంగీ, విష జ్వరాలను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. డెంగీ వ్యాధి ప్రబలుతున్న ప్రతి గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేసి మిలథిన్ స్ప్రే చేయాలన్నారు. దీనివలన దోమల వృద్ధి చెందకుండా ఉంటుందని దోమ కాటు వలన జ్వరాలు దీనిపై జిల్లా అధికారులు పర్యవేక్షణ ఉంటుందని సచివాలయంలోని సిబ్బందిని ఉపయోగించుకుని స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేడు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించుటకు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని జయప్రదం చేయాలని మండల మాజీసైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు హరికృష్ణ రెడ్డి పిలుపునిచ్చారు. 26వ తేదీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమర జవాన్ స్థూపం వద్ద 10 గంటలకు కార్గిల్ అమరవీరులకు నివాళు లర్పించి కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కలెక్టర్, చిత్తూరు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని కావున మండలంలోని మాజీ సైనికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

వ్యాధి నివారణ టీకాల అధికారిగా హనుమంతరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: డాక్టర్ హనుమంతరావు చిత్తూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి వద్ద గురువారం చిత్తూరు జిల్లా టీకాల అధికారిగా డాక్టర్ సి.హనుమంతరావు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా జాయిన్ అయ్యారు.

పిఎసిఎస్‌లకు ఫైవ్‌మ్యాన్ కమిటీలు..?

- ఎరువుల వ్యాపారం తప్పనిసరి
- పదవులొస్తాయని కార్యకర్తల్లో ఆశ

ప్రజాశక్తి - డక్కిలి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతంపై ప్రభుత్వ దృష్టి ఏమో గాని, నామినేటెడ్ పదవులొస్తాయన్న ఆశ టిడిపి కూటమి కార్యకర్తల్లో నెలకొంది. ఫైవ్‌మ్యాన్ కమిటీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ, వ్యవసాయ సీజన్‌లో ఎరువులు సహకార సంఘాల్లో అందుబాటులో ఉంచాలని ఆయా సొసైటీల సిఇఒలకు దిశానిర్దేశం చేశారు. అలాగే రైతులకు పంట రుణాల విడుదల్లో జాప్యం జరగకుండా ఫైవ్‌మెన్ కమిటీలు కసరత్తు చేయనున్నాయి.

ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసిపి పాలనలో ఉన్న త్రీమెన్ కమిటీలను రాజీనామా చేయించి, అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. రైతుల భాగస్వామ్యం లేకుండానే అధికారుల పాలనతోనే రాష్ట్ర ప్రభుత్వం పిఎసిఎస్‌ల పాలన కొనసాగిస్తుందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి అచ్చంనాయుడు సిఎంతో పలు దఫాలు చర్చలు జరిపి వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఫైవ్‌మెన్ కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రతి సొసైటీ పరిధిలో కిందిస్థాయి కార్యకర్తలకు పదవులు ఇచ్చినట్లవుతుంది.

వెంకటగిరి నియోజకవర్గంలో వెంకటగిరి, లాలాపేట, యతలూరు, డక్కిలి, గొల్లపల్లి, దగ్గవోలు, అల్తూరుపాడు, మాధవయ్యపాలెం, లింగసముద్రం, మోపూరు, బాలాయపల్లి, యాచవరం, నిడిగల్లు, భైరవరం, సైదాపురం, రాపూరు, కలవాయిల్లో పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సొసైటీల కార్యవర్గానికి 2018లోనే పదవీకాలం ముగిసింది. అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఏడాదిపాటు పదవీకాలాన్ని పొడిగించింది. 2019లో వైసిపి హయాంలో ఎన్నికలు నిర్వహించకుండా త్రిమెన్ కమిటీలతో సరిపుచ్చింది. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక నియామకాల ప్రక్రియ జరిపేలా జీవో వెలువడుతుందని ఆశావాహులు ఎదురు చూస్తున్నారు.

ఎరువుల అందుబాటుపై మల్లగుల్లాలు

ప్రతి సహకార సంఘంలో ఎరువులు అందుబాటులో ఉంచినా, రైతులకు దూరాభారం అవుతుందని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచితేనే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నది వారి భావన. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం. ఆర్‌బికెల్లో ఎరువులు ఉంచితే వైసిపి మార్క్ పాలన అవుతుందని భావించడం వల్లనే, సొసైటీలకు ఎరువుల వ్యాపారాన్ని మార్చుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఏదిఏమైనా సొసైటీల్లోనూ, ఆర్‌బికెల్లోనూ రెండుచోట్ల అందుబాటులో ఉంచితే అన్నదాతకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.